పేదల మోముల్లో సన్నాల సంతోషం

- సన్నబియ్యానికి లబ్ధిదారుల బారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



చంపాపేట: తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంతో పేదల మోముల్లో సంతోషం వెల్లివిరిస్తోంది. దొడ్డు బియ్యం స్థానాల్లో ముత్యాల్లా మెరుస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేయటంతో ఏమైనా అమ్మేదిలేదు..వండి తినుడే అని మహిళలు సంబరం పడుతున్నారు. గతంలో దొడ్డు బియ్యాన్ని ఆయా రేషన్ షాప్ డీలర్‌కో..దోసెలు, ఇడ్లీలు, ఉప్మాల వంటి టిఫిన్స్ చేసే స్ట్రీట్ ఫుట్ వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించుకునేవారు. దొడ్డుబియ్యం పంపిణీ సమయంలో డీలర్లు మరీ ఫోన్‌చేసి బియ్యం తీసుకెళ్లాలని సూచించినా కొందరు ఆసక్తి చూపేవారు కాదు. సన్నబియ్యం పంపిణీ తర్వాత దుకాణం తెరవకముందే బారులుతీరుతున్నారు. సన్న బియ్యంలో 15 శాతం నూకలు ఉన్నప్పటికీ నూకలను వేరు చేసి సరిగ్గా వండితే మార్కెట్‌లో రూ. 50 బియ్యంతో వండిన అన్నంలా పొడిపొడిగా ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు.



సన్నాల కోసం రేషన్ షాప్ ముందు బారులు తీరిన లబ్ధిదారులు

దొడ్డు బియ్యం స్టాక్ తీసుకెళ్లాలి..

చంపాపేట డివిజన్ పరిధిలోని ఒక్కో రేషన్ షాప్‌లో నాలుగు మాసాలుగా 80 క్వింటాళ్ల నుంచి 100 క్వింటాళ్ల పురుగులు పట్టిన దొడ్డు బియ్యం నిలువ ఉన్నట్లు సమాచారం. నిలువ ఉన్న దొడ్డు బియ్యాన్ని వెనక్కి తీసుకెళ్లాలని పలుమార్లు అధికారులతో మొర పెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రేషన్ డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షాప్‌లో స్థలాభావం వల్ల పురుగుల తుట్టెలతో ఉన్న దొడ్డు బియ్యం పక్కనే సన్న బియ్యం వేస్తుండటంతో సన్నాలకు కూడా పురుగులు పట్టే అవకాశం ఉందని డీలర్లు వేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిల్వఉన్న దొడ్డు బియ్యాన్ని తీసుకెళ్తే బాగుంటుందని డీలర్లు కోరుతున్నారు.

కరువైన రేషన్ కార్డుల విభజన

కొన్ని రేషన్ డీలర్ షాప్‌లకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు 1500 నుంచి 2000 వరకు ఉండగా మరికొన్ని షాప్‌లలో 500 నుంచి 800 వరకే ఉన్నారని దీంతో రేషన్‌పై వచ్చే కమీషన్ కనీసం షాప్ నిర్వహణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రాంతాల వారీగా కార్డులను విభజన చేసి ఆయా ప్రాంత డీలర్ల పరిధిలోకి వచ్చేలా చేసి అందరికీ సమాన తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులను కేటాయించాలని డీలర్లు కోరుతున్నారు.

చంపాపేటలో చౌకధరల దుకాణాలు: 09
తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులు: 8.700
అంత్యోదయ, అన్నయోజన కార్డులు: 162
అన్నపూర్ణ కార్డులు: 06

వండుకుని తింటాం..

గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం తినటానికి పనికి వచ్చేవి కావు. అడపాదడపా దోసె, ఇడ్లీ రవ్వగా ఉపయోగించే వాళ్లం, మరి కొన్నిమార్లు హోటళ్లకు విక్రయించే వాళ్లం. ఈ సన్నబియ్యం తో వండిన అన్నం మంచిగా అవుతంది. ఇప్పుడు ఈసన్నాలు అమ్మేది లేదు. వండుకుని కడుపు నిండా తినడమే.



ఒంగోలు జయమ్మ, కుమ్మరి బస్తీ కర్మన్‌ఘాట్

చాలా ఆనందంగా ఉంది



సన్న బియ్యం పంపిణీ చేయటం చాలా అనందంగా ఉంది. బయట మార్కెట్‌లో సన్న బియ్యం కొనుక్కోలేని మాలాంటి వారికి ఈ సన్నాలు ఓ వరం. గతంలో దొడ్డు బియ్యం వండి తినాలంటే మింగుడు పడేది కాదు. అంతకో ఇంతకో స్ట్రీట్ ఫుడ్ తయారీ హోటళ్లకు అమ్మేవాళ్లం. షాప్‌లో సన్నాలు కొనేవాళ్లం ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. వండుకుంటున్నాం. కడుపునిండా తింటున్నాం

– ఎం. సరిత, కర్మన్‌ఘాట్

ఈ బియ్యం నిరంతరం ఇస్తే బాగుంటుంది..



గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం కంటే ప్రస్తుతం రేషన్ షాప్‌లలో ఇస్తున్న సన్న బియ్యం బాగుతున్నాయి. దొడ్డు బియ్యం అన్నం ముద్ద మింగుడు పడేది కాదు. ప్రస్తుత సన్నాలలో నూకలు ఎక్కువగా ఉండటంతో అన్నం కొద్దిగా మెత్తగా అవుతుంది. నూకలు వేరుచేసి గంజి వార్చి వండితే కడుపునిండా తింటున్నాం. ఈ సన్నాలు నిరంతరం ఇస్తే బాగుంటది.

వి. ఇందిర, శుభోదయ కాలనీ

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీనివాసనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా బెల్లంకొండ ధామ సయ్యచౌదరీ, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ, గోనే సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా కంకణాల జనార్దన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రామచందర కత్రావత్, కర్రె కల్పన, కోశాధికారిగా సేవకుల రాజు, సభ్యులుగా నన్నపనేని నరసింహరాజు, రాయల శ్రీనివాస్, రెగట్టే అశోక్‌రెడ్డి, సత్తీసాయి కమల ఎన్నికైనట్లు అధ్యక్షుడు తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ కాంగ్రెస్ ఘనతే..



సహపంక్తి భోజనం చేస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పేద ప్రజలకు వరం లాంటిదని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో సన్నబియ్యం లబ్ధిదారుడు శంకర్ నాయక్ ఇంటిలో సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన బియ్యం నాసిరకం కావటంతో ప్రజలు తినలేక అవి పక్కదారి పట్టేవని అందుకే పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నారన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దాస్, భాస్కర్ నాయక్, శోయాదవ్, జగన్, రమేష్, గని, సురేష్ పాల్గొన్నారు.

'ఉచిత బాల సంస్కారం' శిక్షణా తరగతులు



చైతన్యపురి: చిన్నప్పటి నుంచే నైతిక, ఆధ్యాత్మిక, మానవతా విలువలు పెంపొందించాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సంత్ సంఘ ప్రముఖ్ పండరీనాథ్ అన్నారు. శ్రీవిరాట్ విశ్వకర్మ సేవాసమితి సౌజన్యంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ గౌతంనగర్ కాలనీలో ఉచిత బాల సంస్కార వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత పురాతన, మహోన్నతమైన సనాతన ధర్మం మన దేశంలో ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన ఆధ్యాత్మిక విజ్ఞానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 25 వరకు జరిగే శిక్షణా శిబిరంలో చిన్నారులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అనంతాచారి, లక్ష్మి, లతశ్రీ, వాణి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విజయోత్సవ ర్యాలీ



మలక్‌పేట: శ్రీచైతన్య స్కూల్ మూసారంబాగ్ బ్రాంచ్ విద్యార్థులు పది ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూసారంబాగ్ బ్రాంచ్‌లో ఇద్దరు విద్యార్థులు 573 మార్కులు, 10 మంది 550 మార్కులు సాధించారన్నారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ రిజ్వాన బేగం, డీన్ శ్రీనివాస్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన వీబీఎస్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో విరామ బైబిల్ పాఠశాల(వీబీఎస్) వారం పాటు ఘనంగా నిర్వహించారు. 'ఫెయిత్‌శాల' అనే పేరుతో ఆదివారం జరిగిన వీబీఎస్‌లో బాలబాలికలు, యువకులు ఆటపాటలతో సందడి చేశారు. పిల్లలు బైబిల్ మెమరీ వర్స్ చెప్పారు. ఈ సందర్భంగా చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడ సాల్మన్, జూనియర్ పాస్టర్ శాంత్‌కుమార్ బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు, కోశాధికారి ఇందర్‌జీ, ఎడిఫైస్ ఫండ్ చైర్మన్ ఆంధ్రాప్రసాద్, రాణిప్రమీల, స్వర్ణ ప్రేమ్‌కుమార్, బ్యూలా వయోలా, సీసీ మెంబర్లు, వీబీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: గారడీ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజా సంక్షేమం విషయంలో ఘోరంగా విఫలమైందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వనస్థలిపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దూసరి మధుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో ఎప్పుడూ కరెంట్ పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన యువత వారి విధానాలు నచ్చక బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, ఆనంద్‌రాజ్, రామ్మోహన్, పార్టీలో చేరినవారిలో వేణు, యాదగిరి, సుమన్‌రెడ్డి, హరినాయుడు, చంద్రశేఖర్, పూర్ణగౌడ్, శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి పనులు

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సూర్యోదయనగర్ కాలనీలో రూ.17.80 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ ఆధునీకరణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లక్రితం వేసిన డ్రైనేజీ ప్రస్తుత అవసరాలకు సరిపడం లేదని, తరచూ లీకేజీలతో రోడ్లపై మురుగు పారుతుందన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా డ్రైనేజీ ఆధునీకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీలోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామచంద్రారెడ్డి, రవి, ప్రభాకర్‌రెడ్డి, రఘుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, నర్సింహ్మారావు, ఫయాజ్, హరీష్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆర్టీసీ కాలనీలో రూ.12 లక్షలతో చేపట్టిన నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు సూచించారు. కార్పొరేటర్ వెంట సాంబయ్య, యాదగిరి, కిరణ్‌గౌడ్, అరుణ, రమేష్ చారి, నాయకులు తోట మహేందర్ యాదవ్ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నీళ్లు లేకపాయే..ఉపాధి కరువాయే..!

- కుమ్మరివాడలో మరమ్మతులకు గురైన బోర్‌వెల్
- నెలరోజులుగా నీటి కటకట

నాంపల్లి: రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబాలది. బస్తీలోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు మట్టి కుండలు తయారు చేసి విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. అయితే నీటి ఎద్దడి కారణంగా నెల రోజులుగా వారికి పని లేకుండా పోయింది. ఇది ఓల్డ్‌మల్లెపల్లి ఫీల్‌ఖానాకు సమీపంలోని కుమ్మరివాడ బస్తీవాసుల దుస్థితి. ఇక్కడ 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అందరూ కుమ్మరి వృత్తి మీదే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. అయితే బస్తీలో బోర్‌వెల్ పాడై నెల రోజులైంది. వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తే బోర్‌వెల్‌కు ఉన్న కాలిపోయిన మోటర్‌ను తీసుకెళ్లి కొత్తది అమర్చలేదు. దీంతో బస్తీవాసులకు నీళ్ల లేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు నీళ్ల లేక కుమ్మరి పనులు సైతం నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్‌వెల్‌ను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.



బస్తీలో నీళ్లు లేని ట్యాంక్



కుమ్మరి వాడలో కుండలు

మలక్‌పేటలో డ్రంకెన్ డ్రైవ్

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల డ్రైవర్లను తనిఖీ చేసి ఒక డీసీఎం, 10 ద్విచక్రవాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఎర్లీబర్డ్ ద్వారా రూ.16 లక్షల ఆదాయం

చాదర్‌ఘాట్: ఎర్లీబర్డ్ ద్వారా మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో రూ.16 లక్షల ఆదాయం వచ్చిందని డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి 5 శాతం రాయితీతో ఏప్రిల్ 1 నుంచి 30 వరకు అవకాశం ఇచ్చారని గత బుధవారంతో ఈ పథకం ముగిసిందన్నారు. సర్కిల్-6 పరిధిలో రూ.17 లక్షల లక్ష్యం పెట్టుకుంటే రూ. 16 లక్షలు వసూలైనట్లు తెలిపారు. సుమారు 60 వేల మంది చెల్లింపుదారులుండగా కేవలం 4 వేల మంది మాత్రమే ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఈ స్కీం ముగియడంతో ఇక నుంచి మొండి బకాయిలపై దృష్టి పెడుతామని చెల్లించని వారికి నోటీసులు ఇచ్చామని, త్వరలో ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధి వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం అష్టోత్తర కలశాభిషేకం, చిన్న రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యుల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గారిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గారిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రవణ్, శ్రీధర్, రామ్ కిషన్ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగి అదృశ్యం



విక్రమ్

నాగోలు: ఇంట్లో గొడవపడిన వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. బండ్లగూడ ఇంద్రప్రస్థకాలనీలోని కేత్రిష్ ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్ బీ-బ్లాక్‌లో నివాసముండే బూర్ల విక్రమ్(30) బ్యాంక్ ఉద్యోగి. ఈ నెల3న భార్య శ్వేతతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆదివారం శ్వేత పోలీసులకు ఫిర్యాదు చేసింది.